అమ్మ ఒడి.. ఆనందాల సవ్వడి

- విద్యార్థుల చదువుకు ఆర్థిక భరోసా
- నియోజకవర్గంలో 23,830 మందికి సాయం



జగనన్న అమ్మ ఒడి పథకం నమూనా చెక్కును అందిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా (ఫైల్)

ఐ.పోలవరం: అందరికీ విద్య అందుబాటులోకి తెచ్చేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బాటలు వేసింది.. ఏ ఒక్క విద్యార్థీ ఆర్థిక భారంతో చదువుకు దూరం కాకూడదనే మహోన్నత ఆశయంతో ముందుకు సాగుతోంది.. అమ్మ ఒడి పథకంతో ఆనందాల సవ్వడి తెచ్చింది.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ప్రధాన 'జగనన్న అమ్మ ఒడి' పథకం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. ప్రతి పేద విద్యార్థి ఉన్నత విద్య అభ్యసించాలనే సీఎం జగన్ దృఢ సంకల్పానికి అమ్మ ఒడి పథకం ఆసరాగా నిలుస్తోంది. దీని ద్వారా ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.13 వేల చొప్పున ఆర్థిక సాయం అందుతోంది. నాలుగు విడత ఈ కార్యక్రమానికి బుధవారం సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా సొమ్ము జమ చేశారు. ఈ నేపథ్యంలో ప్రతి విద్యార్థి ఇంటా ఆనందం వెల్లి విరుస్తోంది. ఆ సొమ్ముతో తమ పిల్లలను ఆనందంగా చదివిస్తామని తల్లిదండ్రులు చెబుతున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, తాళ్లరేవు మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల పరిధిలో 23,830 మంది విద్యార్థులకు రూ.30.93 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ముమ్మిడివరం మండలంలో 5,496 మంది, ఐ.పోలవరం మండలంలో 5,873, కాట్రేనికోన మండలంలో 6,647, తాళ్లరేవు మండలంలో 5,814 మందికి సాయం అందించారు. ఇది తమ పిల్లల చదువుకు ఎంతో ఉపయుక్తం కానుందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఈ పథకం.. వరం



పేద కుటుంబాలు తమ పిల్లలను బాగా చదివించాలని అనుకున్నా ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అమ్మ ఒడి మాకు వరంగా మారింది. దీనిద్వారా అందిస్తున్న సొమ్ముతో మా పిల్లలను ఎలాంటి ఇబ్బంది లేకుండా చదివిస్తున్నాం.

–గొల్లపల్లి శాంతికుమారి, టి.కొత్తపల్లి

జీవితాంతం రుణపడి ఉంటాం..



మా పిల్లల చదువుకు జగనన్న అమ్మ ఒడి పథకం ఎంతో ఆసరాగా నిలుస్తుంది. దీని ద్వారా ఎంతో ప్రయోజనం పొందుతున్నాం. కూలి పని చేసుకుని వచ్చే మాలాంటి పేద కుటుంబాలకు జగనన్న ఎంతగానో భరోసా ఇచ్చి మా పిల్లలను చదివిస్తున్నారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

–పిల్లా లక్ష్మి వీరగణికమ్మ, మురమళ్ల

ఎంతో ఉపయుక్తం



పేదరికంలో ఉన్న మా కుటుంబ పోషణే గగనమైంది. ఇద్దరు పిల్లలను చదివించలేనని అనుకున్నా. చదువు పెద్దగా లేని మాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అమ్మ ఒడి పథకం ఎంతో ఉపయుక్తంగా మారింది. పిల్లలను శ్రద్ధగా చదివిస్తున్నాం. వారిని ప్రయోజకులను చేస్తాం.

–యర్రంశెట్టి నాగమణి, టి.కొత్తపల్లి

సంతోషంగా చదివిస్తున్నాం..



మాది నిరుపేద కుటుంబం. నా భర్త కూలి పని చేస్తుంటారు. ఇల్లు గడవడం కష్టంగా ఉండేది. ఇక ఇద్దరు పిల్లలను ఏవిధంగా చదివించాలని మదన పడుతున్న వేళ జగనన్న ప్రవేశ పెట్టిన అమ్మ ఒడి పథకం మా పాలిట వరంగా మారింది. దీంతో సంతోషంగా పిల్లలను చదివించుకుంటున్నాం.

–దైవాల దుర్గాదేవి, మురమళ్ల

క్లుప్తంగా

గ్రామాల్లో 'జగనన్న సురక్ష' సర్వే



చినకొత్తలంకలో జగనన్న సురక్ష సర్వే ప్రారంభిస్తున్న సొసైటీ అధ్యక్షుడు వర్మ

ముమ్మిడివరం: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష సర్వే జరిగింది. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టారు. జూలై ఒకటో తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనున్న నేపథ్యంలో ముందుగా గ్రామాల్లో సర్వే చేస్తున్నారు. వలంటీర్లకు ప్రత్యేక యాప్ ఇవ్వడంతో వారికి కేటాయించిన 50 ఇళ్లకు వెళ్లి జగనన్న సురక్షలో చేర్చిన 11 రకాల సేవల వివరాలు ఏమైనా అవసరం ఉందా లేదా అని కుటుంబ సభ్యులను అడిగి నమోదు చేస్తున్నారు. చినకొత్తలంక, సీహెచ్ గున్నేపల్లి, మర్లపాలెం గ్రామాల్లో సర్వేను సర్పంచ్‌లు పొత్తూరి ఉమారాణి, విత్తనాల నాగబ్రహ్మేశ్వరరావు, కొత్తలంక సొసైటీ అధ్యక్షుడు పీటీవీ వర్మ, నాయకులు ప్రారంభించారు.

ఎంపీ అనురాధను కలసిన ఉద్యోగులు



ఎంపీ అనురాధకు మొక్కను అందిస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కృష్ణమోహన్ మొగళ్లమూరులోని ఎంపీ నివాసంలో ఎంపీ అనురాధను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. అల్లవరం ఏపీఈపీడీసీఎల్ ఏఈగా బాధ్యతలు స్వీకరించిన చిన బాబు కూడా ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా వారికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

బాధితుడికి చేయూత



బాధితుడికి ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

ముమ్మిడివరం: బోన్ క్యాన్సర్‌తో బాధపడుతూ ఇంటి వద్ద చికిత్స పొందుతున్న మడికి శ్రీను కుటుంబానికి ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి మట్టాడిపాలెంలోని స్వగృహంలో బుధవారం శ్రీనును పరామర్శించి సాయం చేశారు. ఆయన వెంట బడుగు శ్రీనివాసరావు, రామలక్ష్మణులు, రమేష్, ఏలియా రాజు, వినోద్, విపర్తి ప్రసాద్, మంద దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మండల గృహ సారథుల ఇన్‌చార్జుల నియామకం

సాక్షి, అమలాపురం: వైఎస్సార్ సీపీ మండల గృహసారథుల ఇన్‌చార్జులను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపాలిటీ, నగర పంచాయతీ, మండలాలకు ఆ ఇన్‌చార్జులను నియమించారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో తిక్కా వెంకట ప్రసాదరావు (అల్లవరం), చొల్లంగి సుబ్బిరామ్ (అమలాపురం రూరల్), ఈతకోట శ్రావణ్‌కుమార్ (అమలాపురం మున్సిపాలిటీ), కోటం లోవరాజు (ఉప్పలగుప్తం), ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గంలో సఖిలే వెంకటేశ్వరరావు (ఐ.పోలవరం), బొంతు అజయ్‌కృష్ణ (కాట్రేనికోన), కోలా బాబ్జీ (ముమ్మిడివరం), రెడ్డి శివన్నారాయణ (ముమ్మిడివరం నగర పంచాయతీ), దున్నా శ్రీకాంత్ (తాళ్లరేవు)లను నియమించారు.

వారాహి పూజా మహోత్సవాలు

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్ నగర్‌లోని ఆదిశేష నిలయంలో శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో వారాహి షోడశ రాత్రి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం అశ్వారూఢ వారాహి మూల మంత్రంతో విశేష హోమ ద్రవ్యాలను హోమ గుండంలో సమర్పించారు. దుంప జాతులు బీట్‌రూట్, క్యారెట్, చామ, కంద, ముల్లంగి, చిలగడ, బంగాళాదుంపలు, పసుపు కొమ్ములు, వేరుశెనగ కాయలు, తృణ ధాన్యలైన కొబ్బరి కాయలు, గుమ్మడి తదితర వాటిని ఆహుతులుగా వేసి హోమాన్ని జ్వలింపజేశారు. వారాహి అఖండ హోమాల నిర్వహణకు జాస్తి వెంకట రామభూపాల్ రూ.10 వేలు, వేము శివశంకర్ రూ.5 వేలు, సలాది సాయి, జ్యోతి రూ.5 వేలు, లింగోలు విస్సు, శిరీష రూ.5 వేలు, విదులూరి శ్రీవల్లి రూ.4 వేలు విరాళాలుగా సమర్పించారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న డీవీఎస్ రాజు

తాళ్లరేవు: లయన్స్ క్లబ్ ప్రతినిధులంతా సేవే ధ్యేయంగా పని చేయాలని లయన్స్ సీనియర్ ప్రతినిధి డీవీఎస్ రాజు సూచించారు. గురువారం స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది. తాళ్లరేవు లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా చోడే శ్రీనివాస్, కార్యదర్శిగా పెన్మెత్స రాయపరాజు, కోశాధికారిగా కట్టా ఆదినారాయణ తదితరులతో లయన్ డీవీఎస్ రాజు ప్రమాణ స్వీకారం చేయించారు. అదే విధంగా తూరంగి, గొల్లపాలెం, అమలాపురం లయన్స్ క్లబ్‌ల ప్రమాణ స్వీకారం జరిగింది. కార్యక్రమంలో లయన్స్ గవర్నర్ వేలూరి సూర్యనారాయణ, ప్రతినిధులు వినోద్, ధూళిపూడి వెంకట రమణ, నున్న దత్తు, భగవాన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లవరం: మండలంలోని గుండెపూడి, తూర్పులంక గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ రవికుమార్ గురువారం తెలిపారు. వార్షిక మరమ్మతులు, చెట్ల కొమ్మలు, ఆకుల తొలగింపు పనుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తామన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా తొలి ఏకాదశి పూజలు



అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న మంత్రి విశ్వరూప్



అమలాపురం వేంకటేశ్వరస్వామికి మామిడి పండ్లతో అభిషేకాలు చేస్తున్న అర్చకులు



కామాక్షీ పీఠంలో అమ్మవారికి మహిళలు సమర్పించిన సారె, మిఠాయిలు

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

అమలాపురం టౌన్: తొలి ఏకాదశిని పురస్కరించుకుని నియోజకవర్గంలో ఆలయాలు గురువారం భక్తులతో పోటెత్తారు. ఆయా ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. పెళ్లిళ్ల వెంకన్న అయిన అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సందర్శించి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఈఓ దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తలు, అర్చకులు తొలుత మంత్రి విశ్వరూప్‌కు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో రూ.28 లక్షలతో జరుగుతున్న కోనేరు అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణ వైఎస్సార్ సీపీ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, కౌన్సిలర్ దొంగ నాగ సుధారాణి తదితరులు మంత్రి వెంట ఉన్నారు. ఇదిలాఉంటే మాజీ ధర్మకర్త రేపాక సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వామికి వెయ్యి మామిడి పండ్లతో ప్రత్యేక అభిషేకం, పూజలు జరిగాయి. సాయంత్రం స్వామికి శాంతి కల్యాణం నిర్వహించారు.

యానాం: స్థానిక వేంకటేశ్వరస్వామి (మీసాల వెంకన్న) ఆలయం తెల్లవారుజాము నుంచే భక్తులతో కిటకిటలాడింది. యానాం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు పెద్దింటి రాజగోపాలాచార్యులు, వెంకటాచార్యులు, పెద్దింటి రఘురామాచార్యులు, లక్ష్మణాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు.

కామాక్షీదేవికి సారె సమర్పణ

అమలాపురం టౌన్: తొలి ఏకాదశి సందర్భంగా అమలాపురం శ్రీకామాక్షీ పీఠానికి మహిళలు సారెలతో వచ్చి కామాక్షీదేవికి సమర్పించారు. రవికల వస్త్రం, పలు రకాల మిఠాయిలు అమ్మవారికి నైవేద్యంగా అందించారు. మొక్కలు తీర్చుకున్నారు. పీఠాధిపతి కామేశ మహర్షి మహిళలకు ఆశీర్వచనాలు అందజేశారు. సారెల పళ్లేలు అమ్మవారి విగ్రహం ముందు ఉంచి పూజలు చేశారు.

ఉప్పలగుప్తం: తొలి ఏకాదశి సందర్భంగా గొల్లవిల్లి, భీమనపల్లి, ఉప్పలగుప్తం, విలసవిల్లి, చల్లపల్లి గ్రామాల్లోదేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చల్లపల్లిలోని వేణుగోపాల స్వామివారి ఆలయంలో స్వామికి విశేష అలంకరణ చేశారు.

ప్రతి ఇంటా సంక్షేమం



కొమానపల్లిలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్ తదితరులు

- ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్
- చింతపల్లిలంకలో గడప గడపకూ..

ముమ్మిడివరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నారని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం మండలం అన్నంపల్లి పంచాయతీ పరిధి చింతపల్లిలంకలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. అందుకు సంబంధించిన బ్రోచర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను సీఎం జగన్ అందిస్తున్నారన్నారు. మళ్లీ ఈ పథకాలన్నీ రావాలంటే రానున్న ఎన్నికల్లో జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీఅమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, కోలా బాబ్జీ, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ మట్టపర్తి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ పాము నాగవేణి, పాము చిట్టిబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. కొమానపల్లి పంచాయతీ శివారు మొల్లివారిపేటలో జెడ్పీ, ఎంపీపీ, ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులు రూ. 33.44 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులు రూ. 80 లక్షలతో నిర్మించిన అన్నంపల్లి శివారు చింతపల్లి లంకకు వెళ్లే రహదారిని ప్రారంభించారు. ఎంపీపీ కోలా గంగాభవానీ, సర్పంచ్ కాశి ఇందిర, కాశి రామకృష్ణ, కోలా బాబ్జీ, సాధనాల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



తాళ్లరేవులో డ్రైన్‌కు శంకుస్థాపన చేసిన జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్ తదితరులు

తాళ్లరేవు: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతంలో తాళ్లరేవులో నిర్వహించిన కార్యక్రమంలో స్థానికులు గ్రంధి శ్రీను, కొల్లు బాబు తదితరులు తమ ప్రాంతంలో 40 ఏళ్లుగా డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి నిధులు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ మేరకు రూ.4.5 లక్షలతో గ్రామంలో శీలం తాతారావు ఇంటి నుంచి పబ్బినీడి విజయ్ ఇంటి వరకూ డ్రైన్ నిర్మాణానికి జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్ శంకుస్థాపన చేశారు. సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి, ఎంపీడీఓ ఎం.అనుపమ, ఎంపీటీసీ సభ్యుడు రత్న ముత్యాలు, నాయకులు ఆకుల వెంకన్న, కొల్లు శ్రీను, బి.శ్రీనివాసరెడ్డి, చిట్టూరి చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీకి పాము కాటు

కాట్రేనికోన: కందికుప్ప పంచాయతీ కప్పలవారిపేటకు చెందిన ఉపాధి కూలీ జగడం కనకదుర్గ (34) పంట కాలువలో పూడికతీత పనులు చేస్తున్న సమయంలో ఆమె చేతిపై పాము కాటు వేసింది. కందికుప్ప పరిధిలోని పంట కాలువ పూడికతీత పనులలో భాగంగా గడ్డి కోస్తుండగా గడ్డితో పాటు పాము పిల్ల చేతిలోకి వచ్చింది. కనకదుర్గ చేతిపై అది కాటు వేయడంతో భయపడి కొట్టి చంపేసింది. ఉపాధి కూలీలు 108 అంబులెన్సులో కాట్రేనికోన పీహెచ్‌సీకి ఆమెను తరలించగా వైద్యులు వ్యాక్సిన్ వేశారు. మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని, నాలుగు రోజులు అబ్జర్వేషన్‌లో ఉంచాలని వైద్యులు చెప్పారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



యువ ఉత్సవ్‌లో పాల్గొన్న పుదుచ్చేరి రాజ్యసభ సభ్యుడు సెల్వ గణపతి, ఎమ్మెల్యే అశోక్

యానాం: యువత విద్యతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ తెలిపారు. స్థానిక ఎంజీజీ హైస్కూల్ ప్రాంగణంలోని చిల్డ్రన్ ఆడిటోరియంలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమం ముగింపు వేడుకల్లో ఆయన పుదుచ్చేరి రాజ్యసభ సభ్యుడు ఎస్.సెల్వ గణపతితో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యానాంలో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. దీనిపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఓ కంట కనిపెట్టాలని సూచించారు. యువత కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనం తదితర పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీపీ గవర్నమెంట్ కళాశాల ప్రిన్సిపాల్, ఇన్‌చార్జి పరిపాలనాధికారి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తాళ్లరేవు: పితృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త పువ్వల చినబాబు కుటుంబాన్ని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ గురువారం పరామర్శించారు. జార్జీపేట పంచాయతీ ఎంఎల్‌కే నగర్ గ్రామానికి చెందిన చినబాబు తండ్రి పువ్వల వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందారు. వెంకటేశ్వర్లు చిత్రపటానికి ఎమ్మెల్సీ పూలమాల వేసి నివాళులు అర్పించారు. రూ.5 వేల నగదు, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్, సర్పంచ్ పేర్ని ఆదినారాయణ మూర్తి, ఎంపీటీసీ సభ్యురాలు మందపల్లి నాగమ్మ, దడాల జగదీశ్వరరావు తదితరులు చిన బాబు కుటుంబాన్ని పరామర్శించారు.

యానాం సర్వతోముఖాభివృద్ధికి సహకారం



మృతుల కుటుంబాలకు సాయం అందజేస్తున్న సెల్వ గణపతి, ఎమ్మెల్యే అశోక్

యానాం: యానాం నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని పుదుచ్చేరి రాజ్యసభ సభ్యుడు సెల్వ గణపతి అన్నారు. గురువారం స్థానిక మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఆయన పరంపేట, చింతావారి వీధి, బల్లవారి వీధి తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్‌తో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా సెల్వగణపతి మాట్లాడుతూ ప్రధాని మోదీ నేతృత్వంలో తొమ్మిదేళ్లుగా దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. యానాంలో ఎమ్మెల్యే అశోక్ చేపట్టే అభివృద్ధి పనులకు పూర్తి సహకారాన్ని అందిస్తానన్నారు. అనంతరం తాళ్లరేవులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున, గాయపడిన వారికి రూ.30 వేల చొప్పున అందజేశారు. నాయకులు కనకాల రాజు, కనకాల రామదాసు, లోకేశ్వరరావు, పండు సిద్ధార్థ, కాకి నాగేశ్వరరావు, కొమ్ము కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా చిరునవ్వులే లక్ష్యం

మామిడికుదురు: ప్రతి ఇంటా చిరునవ్వులు చిందిస్తూ అందరూ సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం పెదపట్నంలంకలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లారు. ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏ ఒక్కరూ నష్టపోకుండా ప్రజలంతా క్షేమంగా ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఒక వైపు అభివృద్ధికి, మరోవైపు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ సీఎం జగన్ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని చిట్టిబాబు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, పార్టీ నేతలు కొమ్ముల సూరిబాబు, కొమ్ముల పెద్దకాపు, బందారు బాబులు, తోరం భాస్కర్ పాల్గొన్నారు.

ఏకలవ్యుని త్యాగం ఆదర్శం



అమలాపురంలో ఏకలవ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న సత్యనాగేంద్రమణి

అమలాపురం టౌన్: స్వీయ శిక్షణతో విలు విద్య నేర్చుకుని గురు దక్షిణగా తన బొటన వేలు కోసి ఇచ్చిన ఏకలవ్యుని త్యాగం నేటి తరానికి ఆదర్శమని అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అన్నారు. ఏకలవ్య జయంతిని పురస్కరించుకుని స్థానిక మార్కెట్ ప్రాంతంలో ఏకలవ్య విగ్రహానికి ఆమె గురువారం పూలమాల వేసి ప్రసంగించారు. మున్సిపల్ కౌన్సిలర్లు బందారు గోవిందు, యండమూరి గంగ, నాగా రపు వెంకటేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిల్ విప్ బందారు సత్యనారాయణ, జిల్లా ఏకలయ్య సంఘ ఉపాధ్యక్షుడు ఉప్పు శ్రీనివాసరావు, న్యాయవాది రంపవలస శ్రీనివాసరావు, ఆదివాసీ ఎరుకుల సంఘం పెద్దలు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం విగ్రహం వద్ద రొడ్డా భవాని ట్రస్ట్ చైర్మన్ భారతి వెంకటేశ్వర్లు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో సంఘీయులంతా పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: స్థానికంగా ఎస్టీ సంక్షేమ సంఘ మండల అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏకలవ్యుని జయంతిని నిర్వహించారు. సర్పంచ్ అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, ఎస్టీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు మానుపాటి గోవిందు, నాయకులు ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉప సర్పంచ్ మోకా శ్రీను, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిశోర్, వైఎస్సార్ సీపీ రైతు విభాగం మండల అధ్యక్షుడు చిక్కం బాలసుబ్రహ్మణ్యం, మండల కార్యదర్శి పినిపే జయరాజు, మోటూరి సత్యంకాపు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



అమలాపురం ముల్లా ముస్తాఫా మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు

మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు

అమలాపురం టౌన్: త్యాగానికి ప్రతీక బక్రీద్ పర్వదినాన్ని అమలాపురంలో ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. స్థానిక ముల్లా ముస్తాఫా, జామియా మసీదుల్లో బక్రీద్ (ఈద్-ఉల్-అధా) ప్రత్యేక నమాజులు చేశారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, మసీదు పెద్దలు ఎండీ అమీర్, ఎండీ ఆజామ్, ఎండీ బషీర్, మొహినుద్దీన్, నిజాముద్దీన్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

యానాం: స్థానిక ప్రధాన జామియా మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మసీదే ఖుబాలో ప్రార్థనలు నిర్వహించారు. ఇమామ్‌లు ఎండీ అజ్జానీ, మహ్మద్ రఫీ మాట్లాడుతూ త్యాగానికి, సహనానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగ అందరిలో శాంతి సామరస్యాలు వెల్లివిరియాలన్నారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మాట్లాడుతూ ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

కాట్రేనికోన: బక్రీద్ పండుగ సందర్భంగా చెయ్యేరు, ఎస్.సావరం, కాట్రేనికోన గ్రామాల్లోని మసీదుల్లో ముస్లిం సోదరులు వేడుకలు జరుపుకొన్నారు. చెయ్యేరులో శాఖిబ్ హైదర్ బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు.